





# కేసీఆర్ పాలనలో గుంట కూడా ఎండలేదు

- కాంగ్రెస్ పాలనలో వట్టిపోతున్న బోర్లు
- కాలువ నీరందక ఎండుతున్న పంటలు
- అలీసాగర్ చివరి ఆయకట్టు రైతుల గగ్గోలు.. అందని సాగునీరు
- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశాలూ పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- ఆందోళనలో నారాయణపూర్ రైతులు

నవీపేట, మార్చి 8: యాసంగిలో రైతులను సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. పొట్టదశలో ఉన్న పంటలకు సాగునీరందక ఎండిపోతున్నాయి. కేసీఆర్ ఉన్నప్పుడు ఒక్క గుంట కూడా ఎండలేదని ఇప్పుడేమో వేసిన పంటంతా నీళ్ల లేక ఎండిపోతుంటే చూడలేకపోతున్నామని నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలోని వివిధ గ్రామాల రైతులు వాపోతున్నారు. అలీసాగర్ లిఫ్టు ద్వారా సాగునీటిని అందించి, ఎకరం కూడా ఎండకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశించినా వారు పట్టించుకోవడం లేదని, ఫలితంగా నారాయణపూర్ గ్రామ శివారులో 40 ఎకరాలకు అలీసాగర్ సాగునీరు అందడంలేదని వాపోయారు.

నవీపేట మండలంలోని నారాయణపూర్‌కు చెందిన ప్రభాకర్ తనకున్న రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేశాడు. అలీసాగర్ నీళ్లు ఎగువ భాగాన ఉన్న గ్రామాలకు అందినా, తమ గ్రామానికి నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రమణారావు, చాకలి గంగ భూమయ్య, సాగర్, ఎస్ కే సత్తార్, సుంకరి ఆంజనేయులు, సాయిలు అనే రైతులకు చెందిన 40 ఎకరాలు పొట్ట దశలో ఎండిపోతుండటంతో జీర్ణించుకోలేకపోతున్నారు. ఎకరానికి రూ. 30 వేలు ఖర్చుచేశామని, ప్రస్తుత పరిస్థితులు చూస్తే కనీసం పెట్టుబడి కూడా రాని దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వచ్చే మూడు రోజుల వరకు సాగునీరు అందక పోతే పంటలు ఎండిపోయి పశువులకు మేతగా వేయాల్సి వస్తుందని కన్నీంటి పర్యంతమవుతున్నారు. ఎస్సారెస్పీలో పుష్కలంగా నీరు ఉన్నా చివరి ఆయకట్టు వరకు అందక పోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### చివరి ఆయకట్టుకు లిఫ్ట్ నీరందిస్తున్నాం

అలీసాగర్ ఎత్తిపోతల చివరి ఆయకట్టుకు సాగు నీరు అందిస్తున్నాం. నారాయణపూర్ ఆయకట్టు రైతులకు ఎగువభాగం వరకు వెళ్లి నీరు సాగు నీరు తెచ్చుకోవాలని సూచించాం. రైతులు కాలువలకు చిన్నచిన్న మరమ్మతులు చేయించుకుంటే సాగు నీరు చివరి ఆయకట్టు వరకు చేరుతుంది.

**-బాల్‌రాం, ఇరిగేషన్ ఈఈ**



## సాగునీటి కోసం రోడ్డెక్కిన కడెం రైతులు

దండేపల్లి, మార్చి 8 : కడెం ఆయకట్టు చివరి వరకు సాగు నీరందించాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డెక్కారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నాగసముద్రం మలుపు వద్ద శనివారం నాగసముద్రం, మాకులపేట, తాళ్లపేట గ్రామాలకు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. సాగు నీళ్లు అందక పంటలు ఎండిపోతే తమకు పురుగుల మందే దిక్కవుతుందని వాపోయారు. ఇరిగేషన్ ఎస్ఈ, డీఈలు రైతులతో ఫోన్‌లో మాట్లాడి నీళ్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## డెడ్‌స్టోరేజీకి ఆర్డీఎస్

అయిజ, మార్చి 8 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్ట డెడ్‌స్టోరేజీకి చేరుకున్నది. ఎగువ నుంచి నీటి ప్రవాహం నిలిచిపోవడంతో ఆనకట్ట అడుగంటింది. దీంతో శనివారం ప్రధాన కాల్వకు చుక్కనీరు చేరలేదు. టీబీ డ్యాం నుంచి ఆర్డీఎస్, కేసీ కెనాల్ జాయింట్ ఇండెంట్ నీటిని ఈనెల 5న కర్ణాటకలోని గుండ్లకేరీ వద్ద ఎల్ఎల్‌సీ కెనాల్ ఎస్కేప్‌ల నుంచి రోజుకు 4 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆదివారం ఉదయం ఆర్డీఎస్‌కు ఈ నీరు చేరే అవకాశం ఉన్నదని ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సకాలంలో నీళ్లు చేరకపోతే ఆయకట్టు పరిధిలో పంటలు ఎండిపోయే అవకాశాలు మెండుగా ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే తుంగభద్ర డ్యాంలోనూ నీటి నిల్వలు క్రమేపీ తగ్గుతున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సాగు, తాగునీటి అవసరాలకు డ్యాం ద్వారా నీటిని వదులుతుండగా.. నీటిమట్టం తగ్గింది. వేసవి దృష్ట్యా తాగునీటి అవసరాలకు 20 టీఎంసీలను నిల్వ చేసే అవకాశం ఉన్నదని టీబీ బోర్డు అధికారులు తెలిపారు.

### అయిలన్నా.. నీళ్లిస్తవని నమ్మి నాటేసినం



**'అయ్యా..** ఎమ్మెల్యే అయిలన్నా.. నీళ్లిస్తవని నిన్ను నమ్మి నాటేసినం. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టినం. నీళ్లు ఇయ్యక పోతివి. బోర్లేమో పొయ్యకపాయె. వేసినకాడికి పంటంతా ఎండిపోయి తెర్లయినం' అని యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు ఎండిన పొలంలోకి దిగి నిరసన తెలిపారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను నమ్మి సాగు చేశామని చెప్పారు. 'పొలం ఎండిపోవడంతో గత్యంతరం లేక బర్లు, గొర్లను మేపుతున్నం.. అయ్యా.. ఎమ్మెల్యేగారూ నీ కాల్మొక్తం.. దండం పెట్టి వేడుకుంటున్నం. మమ్మల్ని ఆదుకోండి' అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. **-రాజాపేట**

### నీళ్లు లేవాయె.. పంట ఎండిపాయె..



*సాగునీళ్లు లేకపోవడంతో మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట్ మండలంలో ఎండిపోయిన వరి పంటను చూపుతున్న రైతు*

### కాల్వ పారకపాయె.. వరి ఎండిపాయె..



*నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గొల్లపల్లి శివారులో ఎండిన వరి పంట. సంగంబండ రిజర్వాయర్ నుంచి కాలువలో నీళ్లు పారకపోవడం వల్ల పంట ఎండిపోయిందని చెప్పిన రైతు వెంకట్ రెడ్డి*

### నీళ్లులేక పశువుల మేతకు..



***మహబూబ్‌నగర్*** *జిల్లా హన్వాడ మండలం కిష్టంపల్లి గేటు తండా శివారులో రైతు చెన్నయ్య రెండెకరాల్లో వరి పంట వేశాడు. పొట్ట దశ వచ్చే వరకు బోరులో నీటిమట్టం గణనీయంగా తగ్గింది. పంటకు నీళ్లందించే మార్గం కనిపించలేదు. ఉన్న కొద్దిపాటి నీటితో ఎకరా పొలాన్ని తడుపుతుండటంతో మరో ఎకరా పంట ఎండిపోయింది. దీనికితోడు కరెంట్ ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని అయోమయ పరిస్థితి. దీంతో చేసేది లేక ఎండిన వరిని శనివారం పశువుల మేతకు వదిలేశాడు.*



### ఆకేరు రైతు అష్టకష్టాలు

పంట కండ్ల ముందే ఎండిపోతుండటంతో ఆ రైతు భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. కేసీఆర్ పదేండ్ల పాలనలో జీవనదిలా పారిన మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలంలోని ఆకేరు వాగు నేడు చుక్క నీరులేక వెలవెలబోతున్నది. వరి పంట కండ్లముందే నెర్రెలు బట్టి ఎండిపోతున్నది. దానిని కాపాడుకునేందుకు ఏటిలో చెలిమెలు తీసి మోటర్లతో నీటిని పారించేందుకు రైతు అష్టకష్టాలు పడుతున్నారు. -చిన్నగూడూరు



### భూత్పూర్ కాల్వలో తేలిన మోటర్లు

నారాయణపేట జిల్లా మక్తల్ మండల పరిధిలో భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నీళ్లు రాకపోవడంతో కాల్వలో తేలుతున్న మోటర్లు. నీళ్లు లేకపోవడంతో ఈ రిజర్వాయర్ పరిధిలోని పంటలు ఎండిపోతున్నాయి. అప్పు తెచ్చి పంట సాగు చేశామని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## పరిహారమన్న ఇయ్యి.. పురుగుల మందన్న ఇయ్యి

- పుస్తెలతాడు తాకట్టు పెట్టి రెండు బోర్లు వేసిన నీళ్లు పోయలె
- చేతులు జోడించి రేవంత్‌ని వేడుకుంటున్న మహిళా రైతు కళమ్మ
- పన్నెండెకరాల్లో పదెకరాలు పంట ఎండిందని రోదన



సూర్యాపేట, మార్చి 8 (నమస్తే తెలంగాణ): 'అయ్యా రేవంత్‌రెడ్డీ.. కేసీఆర్ ఇచ్చిన నీళ్లు ఇప్పుడు కూడా వస్తాయనే నమ్మకంతో 12 ఎకరాల్లో వరి నాటు పెట్టిన. నీళ్లు రాక పదెకరాలు ఎండిపోయి అప్పులు మిగిలాయి. మాకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.. లేదంటే సచ్చేందుకు పురుగుల మందైనా ఇవ్వాలి' అంటూ సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మొగ్గయ్యగూడెం గ్రామానికి చెందిన మహిళా రైతు కొనకంచి కళమ్మ చేతులు జోడించి వేడుకుంటున్నది. ఎండిన పొలాన్ని గొర్రెల మేతకు అప్పగించిన ఆమెను 'నమస్తే తెలంగాణ' పలుకరించింది. ఈ సందర్భంగా కళమ్మ పుట్టెడు దుఃఖంతో కండ్లల్ల నీళ్లు దీస్తూ తన గోడు వెళ్లబోసుకున్నది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.. 'ఆరేండ్ల కిందటి వరకు బీడుగా ఉన్న భూమిలో కేసీఆర్ నీళ్లతో వరుసగా కడుపు నిండా పంటలు పండించిన. అడ్డమైన అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన ఈ మాయదారి కాంగ్రెస్ ప్రభుత్వం ఇయ్యాల నీళ్లు ఇస్తలేదు. ప్రతిసారి లెక్కనే ఈ సారి కూడా నీళ్లు వస్తాయనే నమ్మకంతోనే 12 ఎకరాల్లో వరి నాటు పెట్టినం. నీళ్లు రాక 10 ఎకరాల్లో పంటంతా ఎండిపోయింది. పొట్టదశకు వచ్చిన వరిని కాపాడుకునేందుకు ఉన్న పుస్తెలతాడు తాకట్టు పెట్టి రెండు బోర్లు వేస్తే చుక్కనీరు కూడా పడలేదు. పెట్టుబడికి ఎకరాకు రూ.40 వేలు ఖర్చయ్యింది. గత్యంతరం లేక ఎకరం పొలం రూ.1,500 లెక్కన గొర్ల మేతకు వదిలిపెట్టినం. ఈ యాసంగికి నీళ్లు ఇవ్వలేని పరిస్థితి ఉంటే ముందు చెప్తే ఎలగటి పంటలైనా వేసుకునేవాళ్లం. ఓటేసి గెలిపించినందుకు రైతులను నట్టేట ముంచుతున్నడు. ఇలాంటి దరిద్రపుగొట్టు ప్రభుత్వం వస్తుందనుకోలేదు. మా ఇంట్లో నలుగురి పేరిట పాస్ పుస్తకాలు ఉంటే ఒక్కరికి కూడా రుణమాఫీ కాలేదు. బ్యాంకుల్లో రుణాలు తీసుకోని వాళ్లు వెంటనే వెళ్లి రెండు లక్షల లోపు తీసుకోవాలని రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ నాయకులంతా ఎన్నికల ముందు చెప్తే రుణం తీసుకున్నాం. పైసా మాఫీ కాలేదు. రుణమాఫీనే కాదు.. కేసీఆర్ ఇచ్చిన నీళ్లను కూడా అడ్డుకుంటున్నరు. రైతులపై ఎందుకింత కక్ష? ఓ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డీ.. దయచేసి ఎండిన వరి పొలానికి పరిహారం ఇయ్యండి. లేదంటే ఆత్మహత్య చేసుకునేందుకు పురుగుల మందైనా ఇవ్వండి. మీకు దండం పెట్టి అడుగుతున్నా.. ఏదైనా ఒకటి ఇవ్వండి' అంటూ కళమ్మ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది.




*డీఆర్సీ సమావేశంలో పాల్గొన్న మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి, మండలి చైర్మన్ గుత్తా తదితరులు*

## నీళ్లు ఇప్పించి ప్రజలను ఆదుకోండి

- నల్లగొండ డీఆర్సీ సమావేశంలో సమస్యలపై ఎమ్మెల్యేల గగ్గోలు
- గ్రామాల్లో తిరగలేకపోతున్నామంటూ కాంగ్రెస్ పార్టీ నేతల గోడు
- పంటలు కాపాడాలని రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని వెల్లడి

నీలగిరి, మార్చి 8: "నీళ్లు లేక గ్రామాల్లో రైతులు, ప్రజలు అల్లాడుతున్నారు. తాగునీరు ఇచ్చేందుకు బోర్లు, పైపులైన్ల వంటి చిన్న చిన్న మరమ్మతులకు కూడా వీలుకావడం లేదు. సాగునీరు లేక పంటలు ఎండుతున్నాయని రైతులు ఎక్కడికక్కడ నీలదీస్తున్నారు. రైతులు పురుగుల మందు డబ్బాలతో వచ్చి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనం ముందుకు వెళ్లలేకపోతున్నాం" అంటూ డీఆర్‌ఏసీ సమావేశంలో నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన డీఆర్సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎదుట ఎమ్మెల్యేలు గగ్గోలు పెట్టారు. డీఆర్సీ సమావేశానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలోని సమస్యలను ఎమ్మెల్యేలు వివరించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నిరుడు ఎండకాలంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇప్పటికీ బిల్లులు ఇవ్వలేదని, అద్దెకు తీసుకున్న ట్యాంకర్లు, బోర్లకు డబ్బు చెల్లించలేదని మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పుడు మళ్లీ వారితో పనులు ఎలా చేయించాలని ప్రశ్నించారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో కాంట్రాక్టర్లు సుమారు రూ.100 కోట్ల పనులు చేస్తే పైసా ఇవ్వలేదని పేర్కొన్నారు.

### కాల్వల్లో చెత్త కూడా తీయలేకపోతున్నాం

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో వేల ఎకరాల్లో వరి పంట ఎండిపోయేటట్టుందని చెప్పారు. గతంలో సమృద్ధిగా సాగునీరు అందేదని, ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. కాల్వల్లో చెత్తను కూడా తీయలేకపోతున్నామని, దాంతో చివరి భూమలకు నీళ్లు అందడం లేదని వివరించారు. రైతులు మందు డబ్బాలు పట్టుకుని ఆత్మహత్య చేసుకుంటామంటూ బెదిరిస్తున్నారని, బిక్కేరు వాగుకు నీళ్లు విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. రామన్నపేట, నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల్లో నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయని, ఆసిఫ్‌నహర్ నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విన్నవించారు.

### 5, 10వేల పనులు కూడా చేయలేని దుస్థితి

దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ పూర్తి గిరిజన ప్రాంతమైన దేవరకొండ నియోజవకర్గంలో తాగునీటి సరఫరా సక్రమంగాలేదని చెప్పారు. చాలా గ్రామాలకు బోర్లే ఆధారమని, చిన్న చిన్న రిపేర్లు వచ్చినా సర్పంచ్‌లు లేక పట్టించుకునే వారు కరువయ్యారని తెలిపారు. రూ.5వేలు, రూ.10 వేల పనులు కూడా చేయలేని దుస్థితిలో గ్రామపంచాయతీలు ఉన్నాయని అవేదన వ్యక్తంచేశారు.

### రాత్రి కరెంట్ కట్ చేసేందుకు ఆదేశించండి

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మూసీతోపాటు ఇతర కాల్వల్లో గుర్రపు డెక్కను తీయలేని స్థితిలో ఉన్నామని, దీంతో చివరి భూములను నీళ్లు అందడంలేదని పేర్కొన్నారు. పైగా మోటార్లు వేయడం వల్ల నీరు కిందికి వెళ్లడంలేదని, రాత్రి పూట కరెంట్ కట్ చేసేందుకు ప్రత్యేకంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేల ప్రశ్నలకు వేదిక మీద ఉన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల, జిల్లా మంత్రి కోమటిరెడ్డి కనీసం సమాధానం ఇవ్వలేదు. అధికారులు స్థానికంగా ఉండి పనిచేయాలని చెప్తూ ప్రభుత్వ తరఫున స్పష్టమైన హామీ ఏదీ ఇవ్వకుండానే సమావేశాన్ని ముగించారు. సమావేశంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతి, కుందూరు జయవీర్‌రెడ్డి పాల్గొన్నారు.